క్లుప్తంగా

కాలనీ ప్రజలకు అందిన భగీరథ నీరు

సాక్షి ఎఫెక్ట్..

కురవి: మండల కేంద్రంలోని గిరిజనుల డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి మిషన్ భగీరథ మంచినీటిని బుధవారం సరఫరా చేశారు. బుధవారం 'సాక్షి'లో 'ట్యాంకర్ నీటితో దద్దుర్లు'.. అందని మిషన్ భగీరథ నీరు.. డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీకి తిప్పలు.. వేసవికి ముందే నీటికి కటకట.. అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి విదితమే. ఈమేరకు మిషన్ భగీరథ ఇంజనీర్ సందీప్, సూపర్‌వైజర్ తిరుమలరెడ్డి సాహూ, సిబ్బంది గంగరబోయిన రఘు, శ్రీకాంత్, సోమల నాగరాజులు భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేసిన అనంతరం కాలనీలోని అన్ని ఇళ్లకు మంచినీటిని సరఫరా చేశారు.

8న లోక్ అదాలత్



గార్ల: రాజీమార్గమే రాజమార్గం అని ఎస్సై ఎస్‌కె రియాజ్ పాషా అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8వ తేదీన జిల్లా కోర్టులో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కేసుల్లో రాజీపడే ఇరుపక్షాల ఫిర్యాదుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా త్రిశూల స్నానం



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కురవి పెద్ద చెరువులో త్రిశూల స్నానం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయం వద్ద తెల్లవారుజామున అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి దొంగ దోపు కార్యక్రమం నిర్వహించారు. వైభవోపేతంగా వసంతోత్సవం నిర్వహించారు. ప్రత్యేక శావలో గ్రామ సేవకు వెళ్లి వసంతాన్ని చల్లుకున్నారు. అనంతరం కురవి పెద్ద చెరువులో త్రిశూల స్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కరెంట్‌తో చేపల వేట ప్రమాదకరం

గార్ల: కరెంట్ తీగలతో చేపలవేట ప్రమాదకరమని విద్యుత్‌శాఖ డీఈ విజయ్ అన్నారు. విద్యుత్‌శాఖ పొలంబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మర్రిగూడెంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా కొత్తగా నిర్మించిన 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఏ రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



నెహ్రూసెంటర్: మాదిగ హక్కుల పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) పట్టణ అధ్యక్షుడిగా శేషం కిరణ్‌కుమార్ ఎన్నికయ్యాడు. బుధవారం సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం



మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన భూక్య పద్మ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డాక్టర్ ఉమ దంపతులను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

డోర్నకల్: డోర్నకల్‌లో చేపట్టిన వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ కోరారు. మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేసి వీధి వ్యాపారులకు కూడా మార్కెట్‌లో స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం డోర్నకల్‌లో అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పోను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, నానియాదవ్, నరేష్, పవన్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కొత్తగూడ: ఆదివాసీ మహిళా సదస్సును విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సందీప్, ప్రధాన కార్యదర్శి సారయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు.

మొక్కజొన్న వైపే మొగ్గు

- మిర్చి పంటకు ప్రత్యామ్నాయంగా సాగు
- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ఏడాది నుంచి దృష్టి సారిస్తున్న రైతులు



మరిపెడ మండలంలో సాగు చేసిన మొక్కజొన్న

మరిపెడ రూరల్: రైతులకు మొక్కజొన్న పంట సిరులు కురిపిస్తోంది. కొంతకాలంగా మరిపెడ ప్రాంతంలో హైబ్రిడ్ మొక్కజొన్న సాగు గణనీయంగా పెరుగుతుంది. దీంతోపాటు గత ఏడాది నుంచి మొక్క జొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. మరిపెడ రైతాంగానికి మిర్చి సాగులో రైతులు కొన్నిసార్లు ఒడిదుడుకులు, మరికొన్ని సార్లు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుపై మొగ్గుచూపుతున్నారు. మిర్చి పంటతో పోల్చుకుంటే మొక్కజొన్న అధిక లాభాలను తెచ్చిపెడుతుంది. మరిపెడ మండలంలోని సుమారు రెండు 450 ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేస్తున్నారు.

అధిక దిగుబడి

మొక్కజొన్న ఎకరానికి 25నుంచి 35క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. విత్తన వ్యాపారులతోపాటు మార్కెట్‌లో క్వింటాకు రూ.2,300 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది 388 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేపట్టగా, ఈ ఏడాది 450 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. మిర్చి పంటపై వరుస నష్టాలు వాటిల్లుతుండడంతో రైతులు ఇతర ఆరుతడి పంటలపై దృష్టి సారిస్తున్నారు. ఈక్రమంలోనే మొక్కజొన్న పంట సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

ఎకరానికి రూ.80వేలకు పైగా ఆదాయం..

మొక్కసాగులో రైతులకు ఎకరానికి రూ.70నుంచి రూ.80వేలకు పైగా ఆదాయం వస్తుండడంతో రైతులు మొక్క జొన్న సాగువైపు మక్కువ చూపిస్తున్నారు. మక్కసాగులో నీటి తడులు కొద్దిగా ఎక్కువ అయినప్పటికీ రైతులు ఈ పంట సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. పెట్టుబడులు ఎకరాకు సుమారు రూ.20వేలు నుంచి రూ.25వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.

మొక్కజొన్న సాగు చేస్తున్నా..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. మొక్కజొన్నకు మద్దతు ధర రావడంతో మిర్చి తోట తగ్గించి సాగు చేస్తున్నా. మిర్చి సాగు చేయడం ద్వారా తెగుళ్లతో దిగుబడి రాక నష్టం వస్తుంది. దీంతో ప్రత్యామ్నాయంగా మొక్క జొన్న సాగు చేస్తున్నాం. పెట్టుబడి తక్కువ పెట్టి, ఎకరానికి రూ. 70వేలు ఆదాయం వస్తుంది.

– పోకబత్తిన వీరస్వామి, రైతు, వీరారం

స్వయం పరిపాలన దినోత్సవం



కొత్తగూడ: ప్రాథమికోన్నత పాఠశాలలో..



మహబూబాబాద్ రూరల్: స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



తొర్రూరు: అంబేడ్కర్ నగర్ పాఠశాలలో..



మరిపెడ రూరల్: రాంపురంలో..



దంతాలపల్లి: వేములపల్లిలో..

ఆయా మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

– మహబూబాబాద్ రూరల్/కొత్తగూడ/మరిపెడ రూరల్/తొర్రూరు/దంతాలపల్లి/తొర్రూరు రూరల్

వ్యవసాయరంగానికి నిధుల కోత సరికాదు



ఆందోళన చేపడుతున్న నాయకులు

తొర్రూరు: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి విధించిన నిధుల కోత సరికాదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్రం నిధుల కోతను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్రం చర్యలు ఉన్నాయని, దానిలో భాగంగానే ఈనెల 10న రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రవి, బొల్లం అశోక్, వీరన్న, లక్ష్మణ్, యాకూబ్, రాములు, సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

మరిపెడ: ఎల్‌ఆర్‌ఎస్‌కు ప్రభుత్వం రాయితీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిపెడ మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత గడువు మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లిస్తే 25శాతం మినహాయింపు ఉంటుందన్నారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో 1248 దరఖాస్తులు చేసుకోగా అందులో ఒకరు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ కట్టారన్నారు. మిగత వారు ఈనెల చివరిలోగా కట్టుకోవాలని కోరారు. ఇందుకోసం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేకంగా 12కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో కౌంటర్‌లో 100 దరఖాస్తులు పరిష్కరించేందుకు దరఖాస్తుదారులకు ఫోన్‌కాల్ చేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా సందేహాలుంటే మున్సిపాలిటీలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర చెల్లించాలి



కేసముద్రం: మిర్చి యార్డును సందర్శించిన నాయకులు

కేసముద్రం: మిర్చి క్వింటాకు రూ.25వేల గిట్టుబాటు ధరను కల్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు మార్తనేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చియార్డును సీపీఎం నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మిర్చికి కనీసం గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. ఇప్పటికైనా మిర్చికి గిట్టుబాటు ధరను అందించడంతోపాటు, వరి ధాన్యానికి బోనస్ అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చాగంటి కిషన్, జల్లె జయరాజ్, నీరుటి జలేందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

దంతాలపల్లి: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం, సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు గునిగంటి మోహన్, ఊడుగుల లింగన్న, బండి శ్రీను, చిత్రారెడ్డి, వీరభద్రం, కొమ్మినేని రామేశ్వరం పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

డోర్నకల్: సీరోలు మండలం చిలుకొయ్యలపాడు గ్రామంలో డోర్నకల్ పోలీసులు నల్లబెల్లం, పటికను పట్టుకున్నారు. బుధవారం సీఐ బి.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకొయ్యలపాడు గ్రామంలో మేకల వెంకన్న ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించి ఏడు క్వింటాళ్ల నల్లబెల్లం, 20కేజీల పటిక, ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. వెంకన్న బెల్లం, పటికను అదే గ్రామానికి చెందిన కోళ్ల భిక్షపతి, బొజ్జ దేవేందర్ వద్ద కొనుగోలు చేయగా వీరు సీరోలు మండలానికి చెందిన హరి వద్ద కొనుగోలు చేసినట్లు గుర్తించి మేకల వెంకన్న, భిక్షపతి, దేవేందర్, హరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్..

అనుమతి లేకుండా పురుగు మందుల విక్రయం.. ముగ్గురిపై కేసు నమోదు

పెద్దవంగర: ఎలాంటి అనుమతులు లేకుండా పంటల పురుగుల మందులను విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. మండల వ్యవసాయాధికారి గుగులోత్ స్వామినాయక్ విధుల్లో భాగంగా చిట్యాల గ్రామానికి వెళ్లాడు. ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేని పురుగుల మందులు విక్రయిస్తున్నాడు. తనిఖీ చేయగా రూ.33వేల విలువ చేసే తెగుళ్ల మందులు పట్టుబడ్డాయి. దంతాలపల్లి మండలం రేపోని గ్రామానికి చెందిన చెంచెలి శ్రీను, శ్యాంసుందర్ రెడ్డి, తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన గుంజ సైదులు అను ముగ్గురి వ్యక్తులపై ఏఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

దూషించిన వ్యక్తిపై..

పెద్దవంగర: వదినను నానా బూతులు తిట్టి బెదిరింపులకు పాల్పడిన ఘటనలో ఆ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఎస్సై కాంత్రి కిరణ్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన కొండ సమ్మయ్యకు వారసత్వంగా సంక్రమించిన 3ఎకరాల భూమి ఉంది. పంటలు సరిగ్గా పండకపోవడంతో బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సదరు భూమిని తమ్ముడు కొండ సతీష్‌కు కౌలుకు ఇచ్చాడు. గత కొన్నేళ్లుగా సోదరుడు కౌలు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్ నుంచి సమ్మయ్య భార్యతో కలిసి గ్రామానికి వచ్చాడు. వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూడగా సోదరుడు సతీష్ జొన్న చేను వేశాడు. మేము కౌలుకు భూమిని ఇవ్వమని చెప్పిన జొన్న పంట ఎందుకు వేశావు.. అని ఫోన్ ద్వారా వదిన అడగగా చెప్పలేని రీతిలో బూతులు తిట్టాడు. మీకు దిక్కున్న చోట చెప్పుకోమని, చంపుతానని హెచ్చరించాడు. సమ్మయ్య ఫిర్యాదు మేరకు సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నల్లబెల్లం తరలిస్తున్న యువకులపై..

మరిపెడ రూరల్: అక్రమంగా తరలిస్తున్న క్వింటా నల్లబెల్లం, 10కిలోల పటికను స్వాధీనం చేసుకొని, ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బొలగాని సతీష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని దంటకుంటతండాకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై క్వింటా నల్లబెల్లం, 10కిలోల పటికను అక్రమంగా తరలిస్తున్నారు. సమాచారం మేరకు వారిని పట్టుకొని రూ.10వేల విలువ చేసే క్వింటా నల్లబెల్లం, రూ.వెయ్యి విలువైన 10కిలోల పటికను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళలపై దాడులను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న మామిండ్ల సాంబలక్ష్మి

నెహ్రూసెంటర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన ఘనంగా నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ సమావేశం అలీమా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబలక్ష్మి మాట్లాడుతూ.. చట్ట సభల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను తిప్పికొట్టాలని, మహిళలు అన్నిరంగాల్లో రాణించి, అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో చట్టాలను రూపొందించి అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎర్రోజు పద్మ, ముదుసు రాణి, తండ మాధవి, లక్ష్మీ, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చర్య తీసుకోవాలి

కురవి: మండల కేంద్రం శివారు శివసాయి క్రషర్ యజమానిపై చర్య తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. శివసాయి క్రషర్ కంపెనీ నామమాత్రము అనుమతులు తీసుకుని ఎక్కువ విస్తీర్ణంలో క్రషర్ నడుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్రసమ్మయ్య పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

కేసముద్రం: కేయూ బుధవారం విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో, కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు తెలిపారు. బీఎస్సీ గ్రూపునకు చెందిన జమ్ముల ఉమాభార్గవి 8.43, ఎర్రబోయిన సౌజన్య 7.50, వెలిశోజు అమ్ములు 6.9 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

నెహ్రూసెంటర్/బయ్యారం/తొర్రూరు: ఈనెల 11వ తేదీన ఖమ్మంలో జరగనున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్‌లో వర్ధంతి సభపోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లింగన్న, దేవేందర్, పాపయ్య, చైతన్య, కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

కురవి: మండలంలోని నేరడ జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యువ శాస్త్రవేత్త ఎన్‌పీడీఎఫ్ అవార్డు గ్రహీత డాక్టర్ రుద్రారపు అరవింద్, రుద్రారపు వెంకటాచలం బుధవారం స్టేషనరీ మెటీరియల్ బహూకరించారు. అలాగే డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ షేక్ జానీ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల టెన్త్ క్లాస్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేశారు.

క్రీడాకారులకు సన్మానం

కురవి: మండలంలోని నేరడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన ఇద్దరు క్రీడాకారులు చరణ్, ఉదయ్‌సాయిలను పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, పీడీ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు సాయిలు, మాంజీ, గంగాధర్, సుధాకర్, కరుణ, అజ్మత్ ఉన్నీసాబేగం పాల్గొన్నారు.

దాడుల నియంత్రణలో విఫలం

బయ్యారం: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు విఫలం చెందుతున్నారని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకే పద్మ అన్నారు. మండలంలోని వెంకట్రాంపురంలో బుధవారం సోమక్క అధ్యక్షతన నిర్వహించిన మహిళా సదస్సును ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఈ సదస్సులో సాయమ్మ, సుజాత, లక్ష్మి, శోభ, విజయ, కాశమ్మ పాల్గొన్నారు.

విరాళాల అందజేత

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని గంగమ్మతల్లి ఆలయ నిర్మాణం కోసం ఆలయ చైర్మన్ కొమ్ము లక్ష్మినర్సు రూ.16వేలు, కొమ్ము శంకర్ రూ.15వేలు అందించగా, గ్రామీణ వైద్యుడు చిత్తారి కల్యాణ్, చిత్తారి లింగయ్య, కొమ్ము లింగరాజు, కొమ్ము మదార్, చిత్తారి రామన్నలు రూ.10వేల చొప్పున విరాళంగా యాదవ సంఘం కమిటీ నిర్వాహకులకు అందజేశారు.

హామీలు అమలు చేయాలి

డోర్నకల్: ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి సంద్రగిరి కృష్ణమూర్తి డిమాండ్ చేశాడు. బుధవారం చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా స్థానిక పోస్టాఫీస్ కార్యాలయ నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించారు. కార్యక్రమంలో మేకల రామారావు, మామిడి నాగరాజు, అజ్మీర పర్సానాయక్ పాల్గొన్నారు.

సాగు జలాలు అందించడమే లక్ష్యం..

మరిపెడ రూరల్: రైతాంగానికి యాసంగి పంటలకు సాగు జలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఉమ్మడి వీరారం పరిధిలోని ఎస్సారెస్పీ ఉప కాల్వలను ఐబీ అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు.

తలంబ్రాల పంపిణీ

డోర్నకల్: స్థానిక ముత్యాలమ్మతల్లి ఆలయంలో డోర్నకల్ ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో సీతారామ కల్యాణ తలంబ్రాలను భక్తులకు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక సమితి అధ్యక్షుడు వేణుగోపాల్‌లడ్డా, సురేష్, మారబోయిన శ్రీనివాస్, సుధారాణి పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

నర్సింహులపేట: రైతులకు ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఏడీఏ విజయచంద్ర షాపుల యజమానులను హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

గూడూరు: చెట్టుపై కొమ్మ నరుకుతుండగా ప్రమదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన మండలంలోని చిర్రకుంటతండాలో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం చిర్రకుంటతండా సమీపంలోని పాకాలవాగు పక్కన ఉన్న చెట్టుకొమ్మ కొట్టడానికి భూక్య దస్రు(34) అనే వ్యక్తి ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి చెట్టు కింద పాకాలవాగు నీటిలో పడి మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో గేదె..

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో వీరిశెట్టి శ్రీను అనే రైతుకు చెందిన పాడి గేదే బుధవారం పాముకాటుకు గురై మృతిచెందినట్లు బాధితుడు వీరిశెట్టి శ్రీను విలపిస్తూ తెలిపారు. గేదే విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

అంత్యక్రియలకు రూ.20వేల ఆర్థికసాయం



అంత్యక్రియలు నిర్వహిస్తున్న బాల్యమిత్రులు

కేసముద్రం: అనారోగ్యంతో మృతిచెందిన బాల్యమిత్రుడి అంత్యక్రియలకు, రూ.20వేల ఆర్థికసాయాన్ని అందజేసిన సంఘటన కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంవిలేజ్ చైతన్యనగర్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొమ్ము సునీల్ కొంతకాలంగా లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే మృతుడి కుటుంబానికి కనీసం ఉండటానికి సొంత ఇల్లు లేకపోవడంతో, వారికి ఉన్న ఖాళీ స్థలంలోనే మృతదేహన్ని ఉంచారు. విషయం తెలుసుకున్న కేసముద్రంవిలేజ్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.20వేల ఆర్థికసాయాన్ని అందించి, అంత్యక్రియలను నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కొమ్ము నరేష్, నారబోయిన సురేష్, గుండు నగేష్, మడిపెద్ది వెంకటేష్, శ్రీకాంత్, శైలజ, రాము, సురేష్, ఎండి.ముబారక్ పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి



టీకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెహ్రూసెంటర్: ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పకుండా టీకాలు వేయించాలని హెల్త్ ఎడ్యుకేటర్స్ కేవీ రాజు, పురుషోత్తం సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆయుష్మాన్ మందిర్ ఇందిరానగర్ కాలనీలో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలకు టీకాలు వేయించడం ద్వారా ఎదుగుదల, వ్యాధులకు గురికాకుండా ఉంటారని తెలిపారు. మొదటి కాన్పు, రెండో కాన్పుకు మధ్య గ్యాప్ ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ నర్మద, ఆరోగ్య కార్యకర్త దీనా, సిబ్బంది రేణుక, మంగ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వ పరిశీలన

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామ పరిధిలో ఎస్సారెస్పీ కెనాల్‌ను డీఈ రాందాస్, ఏఈ సుష్మ రైతులతో కలిసి బుధవారం సందర్శించి పరిశీలించారు. కెనాల్‌లో చెత్త పేరుకపోయి నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఫిర్యాదు చేసినట్లు డీఈ తెలిపారు. రైతులు పాపారావు, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గూడూరు: ప్రతీ ఒక్కరు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఒక్కరు మారితే చాలు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు వాంకుడోతు గోపినాథ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందించారు.

నిర్దేశించిన స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలి



దంతాలపల్లి: నూతనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన స్థలంలోనే తమ ఇల్లును నిర్మించుకోవాలని పీడీ రాజయ్య అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో లబ్ధిదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుడు ఎక్కడైతే ఇల్లు నిర్మించుకుంటానని మొదట చూపుతాడో ఆ స్థలంలోనే నిర్మించాలని తెలిపాడు. ఒక వేళ ఏదైన కారణం వలన స్థలం మార్చినట్లతే డబ్బులు రావన్నారు. నిర్మించుకునే ఇల్లు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 400 గజాలు మాత్రమేనని, మరో 100 గజాలు పెంచుకోవడానికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్ పాల్గొన్నారు.